క్లుప్తంగా

13, 14 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నామా నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -16 బాల బాలికలు తమ ఆధార్‌కార్డు, ఎస్‌ఎస్సీ మెమో జీరాక్స్ వెంట తీసుకొని రావాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా మక్తల్‌లో జరగబోయే 35వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి రూ. లక్ష సాయం



డిపాజిట్ బాండ్ పత్రాలు అందజేస్తున్న నర్సింహారావు స్నేహితులు

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన మొలుగూరి నర్సింహారావు (38) ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో ఆయనతో పాటు 2023లో పదవ తరగతి కలిసి చదువుకున్న స్నేహితులు లక్ష రూపాయలు సేకరించి గురువారం నర్సింహారావు ఇద్దరు కుమారుల పేరిట పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన బాల్య మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలి

మునగాల : మండలంలోని తాడువాయిలో గల శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి సహకరించాలని గ్రామ మాజీ సర్పంచ్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు కోరారు. గురువారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడువాయిలో శాతవాహన కాలంలో నిర్మించిన ఈ దేవాలయం ప్రస్తుత శిథిలావస్థకు చేరుకొని ఆదరణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని శివాలయాల్లో ఎక్కడ లేని విధంగా శివలింగం, నందీశ్వరుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉండడం ఎంతో విశేషమన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పీఈటీలు

హుజూర్‌నగర్ : క్రీడలు, వ్యాయామ విద్య అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని పలువురు పీఈటీలు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో వ్యాయామ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పీఈటీల ప్రమోషన్లు, బదిలీలు, స్పోర్ట్స్ బడ్జెట్, మొదటి సారి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ మీటింగ్స్ ఇలా అన్ని విధాలుగా సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బీరెల్లి శ్రీనివాసరెడ్డి, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

గెల్లి అప్పారావు కుటుంబానికి పరామర్శ



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన పశ్య పద్మ, నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో బుధవారం మృతి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గెల్లి అప్పారావు కుటుంబసభ్యులను గురువారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యురాలు మున్సిపల్ మాజీ చైర్మన్ గెల్లి అర్చన రవి, సీపీఐ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం నిత్యపూజలు, ఆర్జిత సేవలు నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణాలతో వైభవంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలు కరువు

- పాలకవీడు మండలంలో 200 బస్‌పాస్‌లు జారీ
- నెల రోజులుగా బస్సు రాక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, కార్మికులు

పాలకవీడు : మండలానికి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు సేవలు కరువయ్యాయి. మిర్యాలగూడెం ఆర్టీసీ డిపో నుంచి పాలకవీడు మండలంలోని దాదాపు పది గ్రామాలతో పాటు డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వరకు నడిచే బస్సును గత నెల రోజులుగా అధికారులు నిలిపివేశారు. ఈ ప్రాంతానికి ఒక్క బస్సు సౌకర్యమే ఉంది. దానిని కూడా నిలిపివేయడంతో పరిశ్రమకు వెళ్లే మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారు. కార్మికులు సమయానికి పనుల వద్దకు చేరుకోలేకపోతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని జాన్‌పహాడ్ గ్రామస్తులు ఇటీవల మిర్యాలగూడ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. ఆర్టీసీ అధికారులు ఈ ప్రాంత విద్యార్థులు, కార్మికులకు సుమారు 200 బస్‌పాసులు జారీ చేసినట్లు మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో డిపో మేనేజరు సానుకూలంగా స్పందించినప్పటికీ నేటికీ బస్సు సేవలను పునరుద్ధరించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మార్గంలో బస్సును తక్షణమే పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మిర్యాలగూడెం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాన్‌పహాడ్ గ్రామస్తులు (ఫైల్)

బస్సు సేవలను పునరుద్ధరించాలి



పాలకవీడు మండలంలో డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వరకు నడిచే బస్సు సేవలు నెలరోజులుగా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులు, కార్మికుల రాకపోకలకు ఈ బస్సు ఒక్కటే ఆధారం. మా పిల్లలను ఫ్యాక్టరీ స్కూల్‌లో చదివిస్తున్నాం. బస్సు రాక ఆటోలను ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నారు. వెంటనే మిర్యాలగూడెం ఆర్టీసీ డిపో నుంచి పల్లెవెలుగు బస్సు పునరుద్ధరించాలి.

– కాసీం, జాన్‌పహాడ్

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ఉపాధ్యాయురాలి బోధన తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

కోదాడరూరల్ : పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి వార్షిక పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆకాంక్షించారు. గురువారం మండల పరిధిలోని నల్లబండగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి గదిలో టీచర్ బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల మ్యాథ్స్ నోట్ బుక్స్‌ను పరిశీలించి, టీచర్లు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మీరు ఏం అవ్వాలని, ఏం సాధించాలని అనుకుంటున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతమైన చదువులు చదివితే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, గొప్ప చదువులు చదువుకోవాలని ప్రోత్సహించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల మైదానంలో మొక్కలు, పూల మొక్కలు నాటాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, ఆర్ఐ జగదీష్, హెచ్‌ఎం వసంత ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

మేళ్లచెరువు : చింతలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తనిఖీ చేశారు. వెల్లటూరు లిఫ్ట్ పనుల పరిశీలనకు వెళ్తున్న ఆయన పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరుపై ఆరా తీశారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు ఆశోక్, సత్యనారాయణ, డీఈ స్వామి, ఏఈ శ్రీనివాస్, ఎఫ్ ఆర్ఓ ఆదిత్య ఉన్నారు.

హైదరాబాద్ విలీనం ఘనత సీపీఐదే



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : రాష్ట్రంలో రైతులకు యూరియా అందించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గంటవారిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం ఘనత సీపీఐదేనని అన్నారు. ఐదు వేల మంది సీపీఐ కార్యకర్తలు చేసిన ప్రాణ త్యాగంతో దేశంలో తెలంగాణ రాష్ట్రం విలీనమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, పార్టీ పట్టణ కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, పెరికె భరత్, కటికోల వెంకన్న, నవీన్, సంతోష్, రమేష్, శేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాస్, నాగేందర్ తదితరులున్నారు.

యువత గంజాయికి బానిస కావొద్దు



అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కోదాడ రూరల్ సీఐ ప్రతాప్‌లింగం

అనంతగిరి : యువత గంజాయికి బానిస కావొద్దని కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం అన్నారు. గురువారం అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయించిన, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు యువకులు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో అనుమానిత వ్యక్తులు జాడ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిచాలని తెలిపారు. రానున్న ఎన్నికలు, బతుకమ్మ సంబరాల్లో అలజడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

నడిగూడెం : విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని విద్యుత్ శాఖ డీఈ వెంకటకృష్ణయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో నడిగూడెం, మోతె, మునగాల, అనంతగిరి మండలాలకు చెందిన విద్యుత్ శాఖ సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వంద శాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏడీఈ రాములునాయక్, ఏఈలు సైదయ్య, వికాస్, సీతారామయ్య, శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : ఈనెల 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని, కక్షలు, కార్పాణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరు గెలిచినట్లేనని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల అంగీకారంతో సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. క్రిమినల్ కాంపౌండ్, బుల్ కేసులు, సివిల్ తగాదాల కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులలో కక్షిదారులు రాజీపడాలని సూచించారు. జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ కోరారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ ప్రొఫెసర్ ప్రసాద్

చిలుకూరు : విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా ఐటీ రంగంలో రాణించవచ్చని ఐటీ సీనియర్ ప్రొఫెసర్ కెల్ల ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హరిత ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో గొప్ప గొప్ప ఇంజనీర్లు అందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారేనని అన్నారు. అనంతరం విద్యార్థులకు పారిశ్రామిక రంగాల్లో ఉన్న అవకాశాలు, సవాళ్లపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిర్ర కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నరిస్రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న సాయిమందిరం నిర్వాహకులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల శ్రీషిర్డీసాయి మందిరంలో గురువారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిమందిరం నిర్వాహకుడు దేవినేని రవికుమార్ మాట్లాడుతూ.. మండలంలోని బరాఖత్ గూడెం గ్రామానికి చెందిన కందిబండ సుశీలమ్మ కుమారుడు లక్షణ్‌రావు -అన్నపూర్ణ దంపతు శ్రీషిర్డీ సాయి మందిరానికి వంట సామన్లు అందజేసినట్లు తెలిపారు.

16న కోదాడలో సురవరం సంస్మరణ సభ

చిలుకూరు : కోదాడలో ఈ నెల 16వ తేదీన సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సురవరం సంస్మరణ సభకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 17న గ్రామగ్రామాన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్థూపాల వద్ద పార్టీ జెండాలు ఆవిష్కరించి సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి షేక్ సాహెబ్ అలీ, నాయకులు సుల్తాన్ వెంకటేశ్వర్లు, కాంపాటి వెంకటయ్య, చేపూరి కొండలు, పిల్లుట్ల కనకయ్య, రెమిడాల రాజు, దొడ్డా నాగేశ్వరరావు, బాలేబోయిన రాంబాబు, తాళ్లూరి పెద మల్లయ్య, కీసర వెంకటేశ్వర్లు, రెమిడాల జయసుధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వర్లు

సంతాప సభను జయప్రదం చేయాలి

మేళ్లచెరువు : కోదాడలో ఈ నెల 16 న నిర్వహించబోయే సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సారెడ్డి పాపిరెడ్డి, గొంగిరెడ్డి భద్రారెడ్డి, యలమంద, కోటమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మునగాల: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు



మేళ్లచెరువు : సత్కారం పొందిన ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేరేడుచర్లలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను గురువారం నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రగతి విద్యాలయం ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, నజీమా, శ్రీవాణి విద్యాలయం నుంచి లక్ష్మి, సబిహా, అంజలి స్కూల్ నుంచి ఎస్‌కే యాకుబ్, రజిత, పినాకిల్ స్కూల్ నుంచి కవిరాజ్, ఎస్‌కె అజీమ్, అభ్యాస్ స్కూల్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిని శాలువాలతో సన్మానించారు. క్లబ్ జిల్లా చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల కంటే ఉన్నతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్లబ్ చైర్ పర్సన్ వై.సత్యనారాయణరెడ్డి, చాప్టర్ ప్రెసిడెంట్ కోణతం సీతారాంరెడ్డి, క్లబ్ పధాన కార్యదర్శి యూసుఫ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, పూర్ణచంద్రారెడ్డి, విశ్వనాథం, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రావు, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, బాలు, బాల వెంకటేశ్వర్లు, సావయ్య, ప్రధానోపాధ్యాయులు కొప్పు భాస్కర్‌రెడ్డి, ఎస్‌కె మధార్ తదితరులు ఉన్నారు.

మునగాలలో..

మునగాల : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మందితో పాటు మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులను గురువారం మునగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బూర సైదయ్య గౌడ్, ఒక్కంతుల భరత్‌బాబు, రెబబొతు నర్సిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిడతల వెంకటేశ్వర్లు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని గురువారం మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ శ్రీనివాస్ ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : సందీప్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పొనుగోడులో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడులో గల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మేకల సందీప్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, సుధాకర్, కోటేశ్వరరావు, రాజశేఖర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన ఇద్దరు హిందీ ఉపాధ్యాయులు పీర్‌సాహెబ్, కృష్ణవేణి ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందారు. ఈ సందర్భంగా గురువారం నడిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండు మండలాల స్థాయి హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాధికారి బాజా ఉపేందర్ పీర్‌సాహెబ్, కృష్ణవేణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్రం శ్రీనివాస్, ఆర్పీలు ఎం డీ.మౌలానా, శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : ప్రైవేటు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నేరేడుచర్ల లయన్స్ క్లబ్ సభ్యులు

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నేరేడుచర్ల : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇంపాక్ట్ ట్రైనర్, యాంటీ నార్కోటిక్ సోల్జర్, నేరేడుచర్ల హరివిల్లు క్లబ్ అధ్యక్షురాలు వీరవెల్లి శ్రీలత, ఇంపాక్ట్ ట్రైనర్ సరికొప్పుల నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం నేరేడుచర్లలోని అంజలి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మత్తు పదార్థాల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనేక మంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు మంచి మార్గంలో నడవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలక సైదిరెడ్డి, ట్రైనర్ కొత్త లక్ష్మణ్, ఉపాధ్యాయులు జానకిరాములు, యాకుబ్, జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పోలీస్ కార్యాలయంలో విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని ఆదిత్య పాఠశాల విద్యార్థులు బాలాజీనగర్‌లో గల అగ్నిమాపక పోలీస్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరదలు సంభవించినప్పుడు, అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నపుడు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫైర్ సిబ్బంది చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు. అనంతరం ఫైర్ సిబ్బందిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ అధికారి సుబ్బారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కొండపల్లి హైందవి, సిబ్బంది శ్రీనివాసరావు, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ, మహేష్, ప్రవీణ్, మట్టయ్య, రవి తదితరులు ఉన్నారు.

రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ



మునగాల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు



కోదాడరూరల్ : కాపుగల్లు పీఏసీఎస్ ఎదుట..

మునగాల : మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాముకు గురువారం తెల్లవారుజామున యూరియా దిగుమతి అవుతుందన్న సమాచారంతో రైతులు గోదాము వద్ద ఉదయాన్నే క్యూకట్టారు. పీఏసీఎస్‌కు 277 బస్తాల యూరియా మాత్రమే రావడంతో సొసైటీ పర్సన్ ఇంచార్జి కందిబండ సత్యనారాయణ, కార్యదర్శి బసవయ్య, మండల వ్యవసాయాధికారి బి.రాజు, విస్తరణాధికారి రమ్యతేజ.. పోలీసుల సహకారంతో రైతులకు టోకెన్లు ఇచ్చి ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు వెనుదిరిగి వెళ్లారు.

270 బస్తాలు.. 500 మంది రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు పీఏసీఎస్ ఎదుట గురువారం రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. సంఘానికి 270 బస్తాల యూరియా రాగా దాదాపుగా 500 మంది రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. ఎక్కువ భూమి సాగు చేస్తున్న తమకు ఎక్కువ బస్తాల యూరియా కావాలని సిబ్బందిని కోరడంతో ప్రస్తుతానికి ఒకటి రెండు తీసుకెళ్లండి మరోసారి యూరియా వచ్చినపుడు ఇస్తామని రైతులకు నచ్చజెప్పి పంపించారు. యూరియా పంపిణీ చేస్తున్న సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా రూరల్ పోలీసులు అక్కడకు చేరుకొని సీరియల్ ప్రకారం రైతులకు బస్తాలను అందజేశారు.

నేటి నుంచి గ్రామాల వారీగా యూరియా పంపిణీ

మునగాల : మండల కేంద్రంతో పాటు కొక్కిరేణి, తాడువాయి, ఆకుపాముల గ్రామాల్లో గల పీఏసీఎస్‌ల పరిధిలో శుక్రవారం నుంచి గ్రామాల వారీగా యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రాజు తెలిపారు. శుక్రవారం మునగాల సొసైటీ పరిధిలో గల బరాఖత్ గూడెం గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్ ప్రతులను తీసుకువచ్చి యూరియా పొందాలని సూచించారు. యూరియా లోడ్లను ఒక్కో రోజుకు ఒక్కో గ్రామంలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

హుజూర్‌నగర్ : అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.బ్రహ్మం, మండల కార్యదర్శి పి.హుస్సేన్ కోరారు. మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షం, వెంకటయ్య, ఖాసీం, సైదా, నాగమ్మ, నరసింహచారి, సైదులు, వెంకటేశ్వర్లు, సైదయ్య, రాములు, గోపరాజు, బాలసైదులు, సీతారాములు, మాధవరావు, తిరపయ్య, శ్రీరాములు, శ్రీను, మల్లమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, సైదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

యూరియా అందించాలి

నడిగూడెం : రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మల్లెల వెంకన్న, రేఖ తిరపయ్య, సంపతి పిచ్చయ్య, కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, పాండు, వెంకన్న, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.